# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భక్తి శ్రద్ధలతో గణేశుని పూజిస్తున్న ప్రజలకు సకల శుభాలు కలుగజేయాలని ఆ వినాయకుని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు సెప్టెంబరు మొదటి వారంలో పంచాయతీలకు విడుదల అవుతాయని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ తెలిపారు.**
3. **బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.**
4. **రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ఇంటింటికి తాగు నీటిని సరఫరా చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

భక్తి శ్రద్ధలతో గణేశుని పూజిస్తున్న ప్రజలకు సకల శుభాలు కలుగజేయాలని ఆ వినాయకుని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఉపముఖ్యమంత్రి కే. పవన్ కల్యాణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలుపుతూ... రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

---------------------------

పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు ఒక వెయ్యి 120 కోట్ల రూపాయలు సెప్టెంబరు మొదటి వారంలో పంచాయతీలకు విడుదల అవుతాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన నిన్న ఒక ప్రకటనలో కృతజ్ఞతలు చెప్పారు. 'ఆర్థిక సంఘం నిధుల విడుదలతో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులకు ఉపశమనం కలగనుందని పేర్కొన్నారు. స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేస్తూ గ్రామ స్థాయిలో కనీస మౌలిక వసతులు, సేవలు సమర్థంగా అందించాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. రాష్ట్రానికి ఆర్థిక సంఘం నిధులు సకాలంలో విడుదల చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

---------------------------

బంగాళాఖాతంలో అల్ప పీడనం కేంద్రీకృతమైందని, దీని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని, అలాగే వినాయక మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేక్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు..

---------------------------

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ఇంటింటికి తాగు నీటిని సరఫరా చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంతంలో స్మార్ట్ రేషన్ కార్డులను నిన్న పంపిణీ చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ… అమృత్ 2.0 పథకం త్వరలోనే ప్రారంభమవుతుందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పలు పథకాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులను తీసుకువస్తున్నారని వివరించారు. స్వచ్ఛ భారత్ .. స్వచ్ఛ ఆంధ్ర పథకం కింద పట్టణాలలో పరిశుభ్రతను మెరుగుపరుస్తున్నామని మంత్రి తెలుపుతూ…

వాయిస్..31 సెకన్లు

---------------------------

నెల రోజుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త సెల్‌ఫోన్లు అందించనున్నట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గుంటూరులోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ అనుబంధ అంగన్‌వాడీ సంఘాల ప్రతినిధులతో వేణుగోపాల్‌రెడ్డి నిన్న సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల్ని అర్హత కలిగిన వారందరికీ అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు.

---------------------------

రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని.. యూరియా అందుబాటులోకి వస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఒక ప్రకటనలో అన్నారు. రిటైల్ కేంద్రాల వద్ద కానీ.. పీఏసీఎస్‌ల వద్ద కానీ యూరియా, ఇతర ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. రైతులకు ఎటువంటి కొరత లేకుండా ఎరువులు సరఫరా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ పేర్కొన్నారు.

విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యావరణహిత మట్టి గణపతి ప్రతిమల తయారీ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

..వాయిస్... 30 సెకన్లు

---------------------------

కాణిపాకం వినాయకుని బ్రహ్మోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమై సెప్టెంబరు 5వ తేదీ వరకు జరగనున్నాయని ఆలయ అధికారులు తెలిపారు. అనంతరం ప్రత్యేక ఉత్సవాలు సెప్టెంబరు 6వ తేదీన ప్రారంభమై 16వ తేదీ తెప్పోత్సవంతో ముగుస్తాయని వివరించారు. 21 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ దేవస్థానం ఇప్పటికే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

---------------------------

"సరస్సులు: మన గ్రహం జీవనాడి" అనే ఇతివృత్తంతో ఈరోజు ప్రపంచ సరస్సు దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సరస్సులను రక్షించుకోవాలనే లక్ష్యంతో 1984, ఆగస్టు 27న మొదటి 'వరల్డ్ లేక్ కాన్ఫరెన్స్' జరిగింది. ఈ సమావేశంలో సరస్సుల నిర్వహణలో శాస్త్రీయ విధానాలను అనుసరించాలని దేశాలన్నీ తీర్మానించాయి. దీని జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఆగష్టు 27వ తేదీని 'ప్రపంచ సరస్సు దినోత్సవం'గా నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2024, డిసెంబరు 12వ తేదీన ప్రకటించగా.. ఈ సంవత్సరం నుండి దీన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతం, దాని సరిహద్దు ఒడిశా తీర ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..25 సెకన్లు

---------------------------

చెస్ వరల్డ్ కప్ పోటీలు భారతదేశంలో జరగనున్నట్లు ఫిడే అధ్యక్షుడు అర్కాడి వొర్కోవిచ్ తెలిపారు. గోవా వేదికగా అక్టోబర్ 30వ తేదీ నుంచి ప్రారంభమై నవంబర్ 27వ తేదీతో పోటీలు ముగుస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ నలుమూలల నుండి 206 మంది ఈ పోటీలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

=====================